సచివాలయాలతో సమస్యల పరిష్కారం

- ప్రతి గ్రామంలో సొంత భవనాల నిర్మాణం
- అన్ని రకాల సేవలూ అక్కడి నుంచే..
- ప్రజలకు తప్పిన అవస్థలు

దేవరపల్లి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి, పక్కా భవనాలు నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసి, ఉద్యోగులను నియమించింది. గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. దీనితో ప్రజల ముంగిటకే పాలన తీసుకు వెళ్లి సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నారు. గతంలో ప్రతి పనికీ దాదాపు 10 కిలో మీటర్ల దూరంలోని మండల కేంద్రానికి వెళ్లవలసి వచ్చేది. సమయం, డబ్బులు వృథా కావడంతో పాటు కాలయాపన జరిగేది. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో ప్రజలకు అదే



దేవరపల్లిలోని గ్రామ సచివాలయ భవనం

గ్రామంలో అనేక రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, రిజిస్ట్రేషన్లు, రైతులకు అవసరమైన భూముల రికార్డులు, తక్కువ సమయంలో అందుతున్నాయి. దీంతో దళారీ వ్యవస్థ కనుమరుగైంది. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పనులు జరుగుతున్నాయి.

గ్రామ వలంటీర్ల సేవలు బేష్

గ్రామ వలంటీర్ల సేవలు భేష్‌గా ఉన్నాయి. గతంలో ఏ పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి? దరఖాస్తులు ఎవరికి ఇవ్వాలి? తెలిసేది కాదు. ఇప్పుడు గ్రామ వలంటీర్ల ద్వారా ఇంటికే పథకాలు అందుతున్నాయి. వలంటీరు వచ్చి దరఖాస్తు తీసుకుని గ్రామ సచివాలంలో ఆన్‌లైన్ చేయించి ప్రభుత్వానికి పంపుతున్నారు. సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి వ్యక్తికి ఇంటికీ అందుతున్నాయి. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రతి నెలా ఒకటిన ఇంటి తలుపు తట్టి గ్రామ వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్నారు.

గోపాలపురం నియోజకవర్గంలో..

గ్రామ సచివాలయాలు	81
నిర్మించిన భవనాలు	81
అంచనా వ్యయం	రూ. 34.02 కోట్లు
సచివాలయ ఉద్యోగుల సంఖ్య	891 మంది
వలంటీర్లు	1215 మంది

కోటసత్తెమ్మ సేవలో ఎన్నికల అధికారులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారిని నియోజకవర్గ ఎన్నికల అధికారులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిడదవోలు నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు రోహిత్ నాగర్, డీఎల్‌డీఓ కె.కిషోర్‌కుమార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి బెజవాడ శ్రీనివాస్ దర్శించున్నారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ అమ్మవారి చిత్ర పటాలను వారికి అందజేసి సన్మానించారు.

మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

ఉండ్రాజవరం: ఎస్‌ఈబీ పోలీసులు శుక్రవారం మండలంలోని మోర్త గ్రామంలో మహేష్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీన పరుచుకున్నట్టు ఎస్‌ఈబీ నిడదవోలు సీఐ కె.వీరబ్రహ్మం శుక్రవారం తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ఆర్.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి వనిత ప్రచారం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం ద్వారకాతిరుమల మండలంలోని ఏడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సత్తెనగూడెం, రాళ్లకుంట, కొమ్మర, కోడిగూడెం, సాయంపాలెం, మద్దులగూడెం, సీహెచ్ పోతేపల్లి గ్రామాల్లో ప్రచారం జరుగుతుందని వివరించారు. మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రెండు గ్రామాల్లో నేడు తలారి ప్రచారం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి మండలంలోని పెనకనమెట్ట, దొమ్మేరు గ్రామాల్లో ప్రచార రథం ద్వారా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. కావున నియోజకవర్గ పరిధిలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

29 మంది వలంటీర్ల రాజీనామా

చాగల్లు: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో సేవలు అందిస్తున్న 29 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్టు ఎంపీడీవో ఎస్. బుజ్జి తెలిపారు. చాగల్లు -4 సచివాలయం పరిధిలో 15 మంది, చాగల్లు-2 లో ఇద్దరు, చాగల్లు-3 లో ముగ్గురు, చాగల్లు-5, ఎస్. ముప్పవరం సచివాలయాల నుంచి ఒక్కరు, చిక్కాల-1 లో ఒక్కరు, చిక్కాల-2లో ఒక్కరు, బ్రాహ్మణగూడెం సచివాలయం నుంచి ఐదుగురు రాజీనామా చేసినట్టు వివరించారు. మండలంలోని మొత్తం 274 మంది వలంటీర్లకు ఇప్పటి వరకు 102 మంది రాజీనామా చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.

మద్యం అక్రమ నిల్వలపై నిఘా పెట్టండి

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎస్‌ఈబీ శంకరయ్య


ఎస్‌ఈబీ స్టేషన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ కమిషనర్ శంకరయ్య

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎస్‌ఈబీ ఎం.శంకరయ్య ఆదేశించారు. పట్టణంలోని ఎస్‌ఈబీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సిబ్బందికి విధుల్లో నిర్లక్ష్యం తగదన్నారు. సారా తయారీ, అమ్మకాలు, బెల్టు షాపుల్లో అమ్మకాలను నియంత్రించాలని ఆదేశించారు. స్టేషన్‌లోని వివిధ కేసుల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్సై ఎస్.కల్యాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ఆటో కార్మికుల సంఘీభావం

నిడదవోలు: పట్టణం, మండలంలోని 15 ఆటో కార్మిక సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఆటో కార్మికుల ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం స్థానిక తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించారు. వాహనమిత్ర పథకం ద్వారా తమకు ఆర్థిక చేయూత ఇచ్చిన వైఎస్సార్ సీపీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆటో కార్మికులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కుమారుడు వరుణ్‌సాయి, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

తలారికి మద్దతుగా ప్రచారం

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావుకు మద్దతుగా ఆయన కుమార్తె షాలిని, వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు శుక్రవారం ఆ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఓటర్లకు నమూనా బ్యాలెట్ పత్రాలను ప్రజలకు అందజేసి తలారి వెంకట్రావును, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు.

చాగల్లు: వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా చాగల్లు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, మల్లవరం, దారవరం, నందిగంపాడు, చిక్కాల తదితర గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ప్రచారం చేశాయి. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంట్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు తదితరులు ప్రచారం చేశారు.

మంత్రి వనితకు మద్దతుగా..

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనితకు మద్దతుగా దేవరపల్లి పంచాయతీ శివారు కొత్తగూడెంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఇంటింటా ప్రచారం చేశారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఇంటింటికి వెళ్లి పార్టీ మేనిఫెస్టో అందజేశారు.

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు

- దళితులు, క్రైస్తవులు అంటే కూటమికి ఎందుకు చులకన?
- విలేకరుల సమావేశంలో ఏఐసీసీ చైర్మన్ గెరా హనోక్
- పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ చైర్మన్ గెరా హనోక్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: దళితులు, క్రైస్తవులు, మైనారిటీలను కించపరిచి, వారి మనోభావాలు దెబ్బతీసిన కూటమి పార్టీలకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వారంతా తగిన బుద్ధి చెబుతారని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) చైర్మన్, వైఎస్సార్ సీపీ ఎలక్షన్ కో-ఆర్డినేటర్ గెరా హనోక్ హెచ్చరించారు. కొవ్వూరులోని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత మార్పిడిలు చేసుకోవచ్చు, పౌరులు తమకు నచ్చిన మతంలోకి వెళ్లవచ్చని రాజ్యాంగంలోని 25, 28వ అధికరణాలు పేర్కొంటున్నాయని గెరా హనోక్ గుర్తు చేశారు. అందుకు భిన్నంగా కూటమి నేతలు క్రైస్తవుల మనోభావాలను కించ పరిచేలా మాట్లాడడం తగదన్నారు. దళిత క్రైస్తవులంటే ఎందుకంత చులక భావం అని ప్రశ్నించారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. ఇన్నాళ్లూ వలంటీర్ వ్యవస్థను తప్పుబట్టిన చంద్రబాబు ఇప్పుడు తాను అధికారంలోకి వస్తే ఈ వ్యవస్థను కొనసాగిస్తానంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో అమలు ఎలా సాధ్యమో కూటమి నేతలే సమాధానం చెప్పాలని ఆయనన్నారు. దళితులు, క్రైస్తవులు, మైనారిటీలను కించపరిచే పార్టీలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామని ప్రకటించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ అన్ని వర్గాలూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాయన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి జె.రాబిన్, నియోజకవర్గ అధ్యక్షుడు గెల్లా రాజేష్, ముప్పిడి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రగతికి ప్రతి రూపం జగన్

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం


అనంతపల్లి ప్రచారంలో మంత్రి వనిత. చిత్రంలో మేడపాటి షర్మిలారెడ్డి, వందనపు సాయి బాలపద్మ

నల్లజర్ల: గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించి వారి ప్రగతికి ప్రతి రూపంగా నిలిచారని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత అన్నారు. శుక్రవారం ఉదయం ఆమె మండలంలోని గుండేపల్లి, తూర్పు, పడమర చోడవరం గ్రామాల్లో ప్రచారం చేశారు. అలాగే సాయంత్రం అనంతపల్లి, తెలికిచెర్ల గ్రామాల్లో ప్రచారాన్ని కొనసాగించారు. అనంతపల్లిలో ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త, బంక అప్పారావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ప్రత్తి మురళీకృష్ణ, బళ్ల నాని ఆధ్వర్యంలోను, గుండేపల్లిలో సర్పంచ్ కలం ప్రసాద్, ఎంపీటీసీ జంగా లక్ష్మీ శ్రీను, తూర్పుచోడవరంలో గన్నమని సుబ్బారావు, ఎంపీటీసీ చోడసాని సునీత ఆధ్వర్యంలోను, పడమర చోడవరంలో భోగవల్లి శ్రీరామారావు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలోను, తెలికిచెర్లలో సర్పంచ్ బండి చిట్టి, ఉప సర్పంచ్ నక్కా పండు ఆధ్వర్యంలోను ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో మంత్రి వనిత మాట్లాడుతూ దేశంలోనే మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే అన్నారు. ఆయన స్ఫూర్తితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రిని మించిన తనయుడిగా పేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను అమలు చేశారన్నారు. దాదాపు ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. పార్టీ రహితంగా ఐదేళ్లు పథకాలు అమలు చేసి సుపరిపాలన అందించిన వైఎస్సార్ సీపీకి ఫ్యాన్ గుర్తుపై మరోసారి ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయి బాలపద్మ, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, మద్దిపాటి ప్రసాద్, ఆచంట అనసూయ, ఆరెళ్ల లక్ష్మి, యజ్జవరపు గాంధీ లక్ష్మి, వలిరెడ్డి అర్జున్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్లింగ్ చట్టంపై అసత్య ప్రచారం

- చంద్రబాబు మాటలను నమ్మవద్దు
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి
- ఎమ్మెల్యే అభ్యర్థి తలారితో కలసి ప్రచారం


పెద్దేవం ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గూడూరి శ్రీనివాస్, తలారి వెంకట్రావు

తాళ్లపూడి: చంద్రబాబు నోటి నుంచి ఎప్పటికీ నిజం రాదని, ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని పెద్దేవం, రావూరుపాడు గ్రామాల్లో శుక్రవారం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, నియోజక వర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణలతో కలసి డాక్టర్ గూడూరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందు బైక్ ర్యాలీ సాగుతుండగా, వెనుక ప్రచార రథంపై నుంచి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులిద్దరూ ప్రజలకు అభివాదం చేస్తు ఓట్లు అభ్యర్థించారు. ముందుగా పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ ఇంటి వద్ద పూలతో అభ్యర్థులిద్దరికీ భారీఎత్తున స్వాగతం పలికారు. గ్రామదేవత గార్లమ్మ గుడిలో కొబ్బరికాయలు కొట్టారు. ప్రచారంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం అనేది కేంద్రం అమలు చేస్తున్న చట్టమన్నారు. వృద్ధులకు పింఛను ఇవ్వడానికి వీల్లేకుండా కోర్టులో కేసులు వేసి వారిని ఇబ్బంది పెడుతున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు మాట్లాడుతూ అసత్య హామీలతో ప్రజల ముందుకు వస్తున్న చంద్రబాబును నమ్మవద్దన్నారు. ప్రచారంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొలిశెట్టి నాగేశ్వరరావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి, ప్రక్కిలంక గ్రామాల్లో

ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అనంతరం తాళ్లపూడి, ప్రక్కిలంక గ్రామాల్లో కూడా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణతో కలిసి ప్రచార రథంపై పర్యటిస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఆ రెండు పంచాయతీల సర్పంచ్‌లు యాళ్ల స్వప్న, నక్కా అనురాధ చిట్టిబాబు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికలు పేదలు, పెత్తందార్ల మధ్య పోరు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- కాల్దారి, కె.సావరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం


కాల్దారిలో క్రేన్ సాయంతో శ్రీనివాస్‌నాయుడికి గజమాల వేస్తున్న అభిమానులు

ఉండ్రాజవరం: ఈ ఎన్నికల్లో పేదలు, పెత్తందార్ల మధ్య పోరాటం జరుగుతోందని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కాల్దారి, కె.సావరం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాల్లోనూ ప్రజలు ఆయన ఘనంగా స్వాగతం పలికి పూల వర్షం కురిపించి, హారుతులు పట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ సీఎం జగన్ సారథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ ఎంతో మేలు జరిగిందన్నారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకునేందుకు ఈ ఎన్నికల్లో దుష్టశక్తులన్నీ ఏకమయ్యాయన్నారు. ఎన్నికలొచ్చాయంటే చాలు ప్రజలను మోసగించేందుకు చంద్రబాబు ఎన్ని అబద్ధాలైనా మాట్లాడతారని విమర్శించారు. పెన్షన్లు తీసుకోవడానికి అవ్వాతాతలను ఎండలో బ్యాంకుల చుట్టూ తిప్పించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, ప్రతి ఒక్కరినీ అందుకుంటామని శ్రీనివాస్‌నాయుడు హామీ ఇచ్చారు. ప్రచారంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, కాల్దారి, పాలంగి సొసైటీల అధ్యక్షులు అబ్బిన రాంబాబు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, గుణ్ణం రవికుమార్, బస్వా రామన్నరావు, మీసాల సురేష్, వ్రట్రే రమేష్, నార్ని దుర్గారావు, బస్వా జగన్ మోహనరావు, ఉన్నమట్ల అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌తో పాటు 60 మంది వైఎస్సార్ సీపీలోకి..


పెద్దేవంలో మాజీ సర్పంచ్ లక్ష్మీకాంతం, మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న తలారి వెంకట్రావు తదితరులు

తాళ్లపూడి: టీడీపీకి చెందిన పెద్దేవం మాజీ సర్పంచ్ కొయ్యే లక్ష్మీకాంతం, మరో 60 మంది మద్దతుదారులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో వారంతా వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రక్కిలంక గ్రామంలోని పలువురు గిరిజనులు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆంధ్రప్రదేశ్ ఎస్టీ సంక్షేమ సంఘం, ఆ పంచాయతీ సర్పంచ్ యాళ్ల స్వప్న ఆధ్వర్యంలో సుర్రెడ్డి చిన వెంకటేశులు, మంగర మంగయ్య, మంగర గోపి, ఎలుబూడి వెంకటేశు, సత్తిబాబు తదితరులు ఆ పార్టీలో చేరారు. వారికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

బీసీల ఆత్మబంధువు జగనన్న

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- పట్టణంలో బీసీల ఆత్మీయ సమ్మేళనం


బీసీల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు, బీసీ నాయకులు

నిడదవోలు: బీసీలను బ్యాక్ బోన్ క్లాస్‌గా గుర్తించి, వారికి సంపూర్ణ న్యాయం చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం యాదవులు, గౌడ, వడ్డీల సంఘాల (బీసీ)ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారన్నారు. ఆయన అధికారంలో ఉన్నపుడు ఎవరైనా బీసీ నాయకులు వెళ్లి కలిస్తే దుర్భాషలాడేవారని గుర్తు చేశారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే అన్ని పదవుల్లో బీసీలకు పెద్దపీట వేశారన్నారు. 56 బీసీ కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లను నియమించడంతోపాటు వందల మందిని డైరెక్టర్లుగా నియమించారన్నారు. చంద్రబాబు రాజ్యసభ పదవులను కోటీశ్వరులకు అమ్ముకుంటే జగనన్న రాజ్యసభ పదవులను సైతం బీసీలకు ఇచ్చి వారి పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో తాను ఎల్లప్పుడూ బీసీలకు తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

రోగికి ఆర్థిక సాయం

కొవ్వూరు: క్యాన్సర్ వ్యాధిలో బాధపడుతున్న చిడిపి గ్రామస్తుడు ఎలుగంటి వెంకట్రావుకు లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ తరపున శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. చిడిపి సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు కుమార్తె స్వాతి పుట్టిన రోజు సందర్భంగా ఆయన రూ.5 వేలు, క్లబ్ సభ్యులు రూ.5 వేలు సాయంగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట్రావు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు


స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేవరపల్లి శాఖ వద్ద పింఛను సొమ్ము కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

దేవరపల్లి: సామాజిక పింఛన్ల కోసం లబ్ధిదారులు నానా అవస్థలూ పడుతున్నారు. వారి జూన్ నెల పింఛన్‌ను సొమ్మును ప్రభుత్వం బ్యాంకుల్లో వారి ఖాతాలకు జమ చేసింది. ఐదేళ్లుగా ఇంటి వద్దే వలంటీర్ల ద్వారా తెల్లవారక ముందే పింఛన్ అందుకున్న అవ్వాతాతలు, ఎన్నికల కోడ్ రావడంతో రెండు నెలలుగా పింఛను కోసం ఇబ్బంది పడుతున్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 44 వేల మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఏప్రిల్ నెల గ్రామ సచివాలయాల వద్ద అందజేసిన పింఛన్లను, మే నెల బ్యాంకుల్లో జమ చేశారు. 75 శాతం పింఛన్లు బ్యాంకుల్లో జమ చేయగా, 25 పింఛన్లు ఇంటి వద్ద ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 80 శాతం వయస్సు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద పింఛన్లు అందజేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వృద్ధులు బ్యాంకుల వద్ద మండుటెండలో పడిగాపులు కాస్తున్నారు.

అమ్మవారి వార్షికోత్సవాలు ప్రారంభం


ఆరికిరేవులలోని శ్రీరాజ రాజేశ్వరి అమ్మవారు

కొవ్వూరు: ఆరికిరేవుల గ్రామంలో కొలువైన శ్రీరాజ రాజేశ్వరి అమ్మవారి ఐదో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించాక, సహస్ర నామ కుంకుమార్చనలు చేశారు. సుమారు అరవై ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయాన్ని ఐదేళ్ల క్రితం పునః నిర్మించారని యనమదల వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు గుత్తా వెంకటకృష్ణ, చావా రంగారావు, యనమదల రామారావు, పోతుల ఎకోనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారిని ఆభరణాలు, పూలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రతి కార్యకర్తా స్టార్ క్యాంపెయినర్ కావాలి

కొవ్వూరు: సిద్ధం పేరుతో వైఎస్సార్ సీపీ చేపట్టిన ఎన్నికల ప్రచారాన్ని, మేనిఫెస్టోను ప్రతి కార్యకర్తా ఇంటింటికీ తీసుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమరం తుది దశకు చేరుకున్నందున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్తా ఒక స్టార్ క్యాంపెయినర్‌గా పని చేయాలన్నారు. మేనిఫెస్టోను ప్రతి ఇంటికీ చేర్చాలన్నారు. ఇందుకోసం ప్రతి ఇంటి నుంచి ఒకరు స్టార్ క్యాంపెయినర్‌గా వచ్చి 96120 96120 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలతో పాటు 25కి 25 ఎంపీ స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకోనుందన్నారు.